గరుడ వాహనమెక్కి..



దిగ్గున వెలిగే దీపకాంతులు.. హోరెత్తే గోవిందలు.. గిరిజన నృత్య విన్యాసాలు.. జతగా వాయిద్యాల ఘోష.. 'ఇటు గరుడని నీవెక్కినను.. పటపట దిక్కులు బగ్గన పగిలె' అని అన్నమయ్య వర్ణించినట్టుగానే ఆదివారం రాత్రి తిరుమల కొండమీద గరుడోత్సవం సాగింది. మాడవీధులు భక్తజన సముద్రంగా భాసిల్లాయి. లక్ష్మీకాసుల హారం ధరించిన శ్రీనివాసుడు తన ఇష్టవాహనమైన గరుడుడిని అధిరోహించి గజ, వృషభ దళాలు ముందు నడుస్తుండగా మందగమనంతో విహరించాడు. రాత్రి నుంచే చలిని లెక్కచేయకుండా గ్యాలరీ మెట్లనే పడకలుగా మార్చుకున్న భక్తులు.. పగటి ఎండకు దుప్పట్లకింద తల దాచుకుని గరుడుడిపై ఊరేగుతూ వచ్చే స్వామికోసం ఎదురు చూశారు. ప్రకటించిన సమయంకన్నా 23 నిమిషాల ముందే గరుడవాహన సేవ మొదలైంది. ఉండి ఉండీ కురిసే జల్లుల నడుమ మాడవీధుల్లోని లక్షలాది భక్తజనానికి దర్శనమిస్తూ ముందుకు సాగింది.

ఆరు గంటల పాటు సాగిన గరుడోత్సవం ● 23 నిమిషాల ముందే కదిలిన వాహనం ● 2.4 లక్షలమందికి వాహన దర్శనం ● భక్తజన సంద్రాన్ని తలపించిన తిరుమల

సంతృప్తికరంగా మలయప్ప దర్శనం

మధ్యాహ్నం ఎండకు ఎండుతూ.. సాయంత్రం వర్షానికి తడుస్తూ గరుడ సేవలో మలయప్ప దర్శనానికి భక్తులు అత్యధిక సమయం గ్యాలరీల్లో వేచి ఉన్నారు. దీంతో గ్యాలరీలకు అతి సమీపంలోకి గరుడవాహనాన్ని తీసుకెళ్లి భక్తులకు దర్శనం కల్పించారు. గంటలకొద్దీ వేచి ఉన్న భక్తులు కనువిందైన దర్శనంతో సంతృప్తిగా వెనుదిరిగారు. కళాబృందాలూ ఆరు గంటలపాటు నిరంతరాయంగా ప్రదర్శనలతో అలరించాయి. నాలుగు గజరాజులూ ఐదు గంటల పాటు స్వామి వాహనం ముందే నిలబడి సేవ చేశాయి. ఉదయం 11 గంటలకంతా గ్యాలరీలు నిండటతో మాడవీధుల గేట్లను మూసేశారు. సాయంత్రం 4 గంటల సమయానికి 1.90 లక్షల నుంచి 2 లక్షల మంది గ్యాలరీల్లోకి చేరారని అధికారుల అంచనా. మరోవైపు కార్నర్ పాయింట్లు, రీఫిల్లింగ్ ద్వారా మరో 30 వేల నుంచి 35 వేల మంది దర్శనం చేసుకున్నారు. ఇలా, దాదాపు 2.40 లక్షల మందికి గరుడ సేవ దర్శనం లభించింది. మాడవీధుల వెలుపల దాదాపు 30 వేల నుంచి 40 వేల మంది ఉండొచ్చని, మూలవిరాట్టు దర్శనానికి కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, కృష్ణతేజ సర్కిల్ నుంచి అక్టోపస్ భవనం వరకు మరో 50 వేల మంది చొప్పున దాదాపు 3 లక్షల మందితో తిరుమల నిండిందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. మూలవిరాట్టు దర్శనానికి దాదాపు 36 గంటల సమయం పడుతుండటం గమనార్హం.

రద్దీతో ముందుగానే ప్రారంభం

సాయంత్రం 6.30 గంటలకు గరుడసేవ ప్రారంభిస్తామని టీటీడీ ప్రకటించింది. కానీ, ఉదయానికే గ్యాలరీలన్నీ నిండి మాడవీధులు రద్దీగా మారాయి. దీంతో నిర్ణీత సమయానికన్నా 23 నిమిషాల ముందే.. 6.07 గంటలకే వాహన సేవ ప్రారంభించారు. తొలుత బ్యాడ్జీలు కలిగిన వీఐపీలకు ఉత్సవ మూర్తి దర్శనం చేయించి పంపారు. అనంతరం వాహనాన్ని ముందుకు నడిపారు.

ఘటాటోపం తీసుకొచ్చే క్రమంలో తోపులాట



వాహన మండపం నుంచి గరుడ వాహనం ప్రారంభమై 7.20 గంటల సమయంలో మహద్వారం వద్దకు చేరుకుంది. అక్కడి హారతి పూర్తయ్యాక ముందున్న గేటు వద్దకు తీసుకొచ్చి నాదనీరాజనం వైపున్న భక్తులకు దర్శనం కల్పించే సమయంలో వర్షం మొదలైంది. వెనకున్న ఘటాటోపాన్ని వాహనం వద్దకు తీసుకొచ్చే సమయంలో కొంతమంది ఉద్యోగులు, భక్తులు దీంతో పాటు రావడంతో భద్రతాసిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. ఓ బాలిక కింద పడిపోగా.. భద్రతాసిబ్బంది క్షణాల్లో ఆమెను పైకి లేపడంతో ప్రమాదం తప్పింది. వాహనం ముందూ వీఐపీల రద్దీ అధికంగా ఉంది. వాహనంతో పాటే ముందుకు నడుస్తున్న క్రమంలో సమయంలో కొంత గందరగోళం ఏర్పడింది.

24 గంటలకుపైగానే నిరీక్షణ

గరుడ వాహనంపై స్వామిని దర్శించుకునేందుకు 24 గంటలకుపైగానే భక్తులు నాలుగు మాడవీధుల్లో నిరీక్షించారు. శనివారం రాత్రి సర్వభూపాల వాహన సేవ కోసం మాడవీధుల్లోకి చేరిన పలువురు భక్తులు ఆదివారం రాత్రి నాటి గరుడసేవ కోసం అలానే ఉండిపోవడం గమనార్హం. టీటీడీ అందజేసే అన్నపానీయాలు స్వీకరిస్తూ గ్యాలరీల్లోని ఉండిపోయారు.

మహా చండిగా బోయకొండ గంగమ్మ





మహిషాసురమర్దిని అలంకారంలో చిత్తూరులోని గిరింపేట దుర్గమ్మ

చౌడేపల్లె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో ఆదివారం బోయకొండ గంగమ్మ మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.రెండు చేతుల్లో త్రిశూలం, మరో రెండు చేతుల్లో అంకుశం, పాశం, ఇంకో చేతిలో ఖడ్గం, మరో చేతిలో కుంకాభరణాలతో అలంకరించి ధూప, దీప, నైవేద్యం సమర్పించారు.

రెస్కో అవినీతి విచారణ

నిగ్గు తేలేనా?

- 'వైసీపీ' నియామక ఉద్యోగుల్లో ఆందోళన
- తొలగిస్తే ఏర్పడబోయే పరిణామాలపై అధికార పార్టీలోనూ కలవరం
- నేడు మహాజన సభ

7 లో

ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. బైరెడ్డిపల్లెలో 4.4, తవణంపల్లెలో 3.6, ఐరాలలో 2.2, కుప్పంలో 2, పెద్దపంజాణిలో ఒక మి.మీ. వర్షం కురిసింది. కాగా, జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నా.. ఆదివారంవరకు రెండు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. శాంతిపురం మండలంలో సెప్టెంబరు నెల సగటు వర్షపాతం 205.8 మి.మీకిగాను 106.2 మి.మీ., గుడుపల్లెలో 195.0 మి.మీకిగాను 95.8 మి.మీ వర్షం కురిసి లోటు వర్షపాతం నమోదయ్యింది. మిగిలిన 22 మండలాల్లో సగటుకు మించి వర్షపాతం నమోదవగా ఎనిమిది మండలాల్లో ఆశించిన మేర వర్షం కురిసింది.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్‌ఎస్'

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను తీసుకుంటారన్నారు. జిల్లా అధికారులందరూ విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లో కూడా అధికారులు పీజీఆర్ఎస్ నిర్వహించాలని సూచించారు.

అందాల హరివిల్లు

రామకుప్పం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో ఆదివారం సాయంత్రం ఆకాశంలో హరివిల్లు అలరించింది.పగలంతా మండుటెండ జనాన్ని ఠారెత్తించినా సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. 10నిమిషాల పాటు వాన కురిసింది. వాన ఆగిన తర్వాత కాసేపటికి ఆకాశంలో హరివిల్లు ఆవిష్కృతమైంది. కొన్ని నిమిషాల్లోనే అస్తమిస్తున్న సూర్యుడు ప్రకాశవంతంగా మారడంతో హరివిల్లు అదృశ్యమైంది.



పలమనేరు
కుప్పం/పుంగనూరు

గరుడ వాహనంపై విహరించిన శ్రీవారు


గరుడ వాహనంపై విహరిస్తున్న కల్యాణ వెంకటరమణస్వామి

పుంగనూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి పట్టణ పురవీధుల్లో గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడ వాహనసేవ సందర్భంగా పుంగనూరు శ్రీవారి ఆలయంలో సైతం గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. టీటీడీ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆదివారం రాత్రి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో విహరించారు. భక్తులు స్వామివారికి టెంకాయలు, పూలు సమర్పించి పూజలు చేశారు. ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి బొమ్మలకొలువు, గరుడసేవలో భక్తులకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

పేదలకు అండగా కంటి వైద్యశాలలు


సోమలలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

సోమల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలకు అండగా కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు, విశ్రాంత సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఎన్.మునివెంకటప్ప అన్నారు. ఆదివారం సోమల హైస్కూల్‌లో మదనపల్లె రమా కంటి వైద్యశాల నిపుణులు మహేశ్‌రెడ్డి 160 మందికి కంటి పరీక్షలు జరిపారు. 60 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. సాయిబాబా ఆలయ కమిటీ ఉచిత భోజనం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమసుధాకర్, పీడీ కరుణానిధి, కమిటీ కార్యదర్శి పీఎస్ నాగరాజ, ఉపాధ్యాయులు జ్యోతీశ్వరుడు, సూర్యప్రకాశ్, మహేంద్రబాబు, జగన్‌మోహన్, మునిచంద్ర, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కమిటీ చైర్మన్, డైరెక్టర్‌కు సన్మానం




పలమనేరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్‌కమిటీకి నూతన చైర్మన్‌గా నియమితులైన కె.రాజన్నను, డైరెక్టర్ ఎం. శంకరప్పను ఆదివారం వాల్మీకి సంఘ నేతలు కలిసి శాలువకప్పి, సన్మానించి అభినందనలు తెలిపారు. వాల్మీకి వర్గానికి చెందిన ఇద్దరికి నామినేటెడ్ పదవులు లభించడం హర్షణీయమని, ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘ రాష్ట్ర నాయకులు ఎల్.భాస్కర్, అద్దాల నాగరాజు, నియోజకవర్గ నాయకులు రొంటకుంట్ల నరసింహులు, బొమ్మనపల్లి మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం


తిమ్మసముద్రంలో బోరు తవ్వకం ప్రారంభోత్సవంలో టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తోందని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి తెలిపారు. ఆదివారం మండల పరిధి తిమ్మసముద్రం కాలనీలో కొత్త తాగునీటి బోరు తవ్వకాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, కో-ఇన్‌చార్జి నవీన్, నేతలు విజయ్‌కుమార్, చలపతి, సురేష్, మురళీ, బాలరాజు, సుబ్రీ, పద్మనాభరెడ్డి, గణేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల అందజేత



పలమనేరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని ఆర్ట్‌ఆఫ్ హ్యూమానిటీ ఫౌండేషన్ నిర్వాహకులు ఆదివారం పలమనేరు సమీపంలోని కేటిల్ ఫారం వద్ద దివ్యాంగులకు నిత్యావసరసరుకులు అందజేశారు. నియోజకవర్గంలోని నిరుపేద దివ్యాంగులు 20 మందికి వంటనూనె, కందిపప్పు, బియ్యం, చక్కెర, రాగిపిండి, మిరపపొడి, ధనియాలపొడి, పసుపు, ఉప్పు, కూరగాయలు అందజేశారు. ఈకార్యక్రమంలో దివ్యాంగ నాయకులు రామానాయుడు, పి.రమేష్, ఎం.హరిక్రిష్ణ, గోవిందు, దొరబాబు, వేణుగోపాల్, భాగ్యలక్ష్మి, భూలక్ష్మి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలదే


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలదేనని పాస్టర్ రాజేశ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో సీనియర్ సిటిజన్స్ డే నిర్వహించారు. పాస్టర్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు అభద్రతభావం కలగకుండా జాగ్రత్తగా చూడాల్సిన అవసరముందన్నారు. 60ఏళ్లు నిండిన వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, సురేశ్, భరత్‌భూషణం, కృపాకర్, ఉదయ్‌కుమార్, సుధాకర్, సత్యరాజ్, వరకుమార్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

మహా చండిగా బోయకొండ గంగమ్మ


బోయకొండ: ప్రత్యేకాలంకారంలో మూలస్థానం అమ్మవారు | ప్రత్యేకాలంకారంలో అమ్మవారి కలశ స్థాపన | కల్లూరు: ధనలక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరి | ఆనిగానూరులో వెండి కవచాలంకరణ, రామకుప్పంలో గాజుల అలంకారంలో వాసవీకన్యకాపరమేశ్వరి | రొంపిచెర్ల: చండిగా ముత్యాలమ్మ

చౌడేపల్లె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దసరా మహోత్సవాలలో 6వ రోజు ఆదివారం అమ్మవారు మహా చండి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని రెండు చేతుల్లో త్రిశూలం, మరో రెండు చేతుల్లో అంకుశం, పాశం, మరో చేతిలో ఖడ్గం, మరో చేతిలో కుంకాభరణాలతో షడ్భుజాలుగా, స్వర్ణాభరణాలతో అలంకరించి, ధూప, దీప, నైవేద్యం సమర్పించారు. డార్మిటరీ హాల్‌లో అమ్మవారికి కలశస్థాపన చేసి, ఉత్సవమూర్తిని, ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు ఉభయదారులచే గణపతి, నవగ్రహ, దుర్గ, చండి, మృత్యుంజయేశ్వర, మహాలక్ష్మి, మహా చండి హోమాలు నిర్వహింపచేశారు. కాగా అమ్మవారికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలత దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ● కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు బజారువీధిలో కొలువైన కన్యకాపరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ● రామకుప్పం: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు రామకుప్పంలో గాజుల అలంకారంలో, ఆనిగానూరులోని వెండి కవచాలంకారంలో దర్శనమిచ్చారు. కంబాలదేవులపల్లె సప్తమాతృకా చౌడేశ్వరమ్మ ఆలయంలో దుర్గా కుంకుమ అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. ● రొంపిచెర్ల: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రొంపిచెర్ల పట్టణంలోని ముత్యాలమ్మ చండి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ● సదుం: జాంద్రపేటలోని రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. అలాగే సదుం గ్రామ దేవత సదుమమ్మ అశ్వవాహనంపై గాయత్రి అలంకరణలో దర్శనమిచ్చారు. ● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో ఉన్న సల్లాపురెమ్మ మహా చండి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బాటగంగమ్మ ఆలయం, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయం, గడ్డూరు సల్లాపురెమ్మ ఆలయంలో కూడా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ● వి.కోట: వి.కోట దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనమిచ్చారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, శ్రీనివాసులు నాయుడు కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి నామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ● పుంగనూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పుంగనూరులోని పలు ఆలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణలు, పూజలు వైభవంగా జరిగాయి. బజారువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి శాకంబరీదేవి అలంకరణలో, ఉత్సవమూర్తి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విరూపాక్షిమారెమ్మ మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. చదళ్ల వద్ద వెలసిన చౌడేశ్వరీదేవి మధురమీనాక్షిగా, స్థానిక కోనేరు వద్దగల కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి, నగరిలో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రసన్నపార్వతీదేవి, భోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ● సోమల: మండలంలోని కందూరు కన్యకాపరమేశ్వరి అమ్మవారిని తమలపాకులతో, పత్రపల్లెలో పలురకాల పుష్పాలతో అలంకరించారు. సోమల బోయకొండమ్మ, కందూరు పాలేటమ్మ అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.


పుంగనూరు: మహాలక్ష్మిగా విరూపాక్షి మారెమ్మ | మధురమీనాక్షిగా చదళ్ల చౌడేశ్వరీదేవి | శాకంబరీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి | ప్రత్యేకాలంకరణలో అన్నపూర్ణాదేవి | సదుం: సరస్వతిగా రామలింగ చౌడేశ్వరి దేవి | బైరెడ్డిపల్లె: మహాచండిగా సల్లాపురెమ్మ | వి.కోట: విజయలక్ష్మిగా దుర్గమ్మ | బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న ప్రముఖులు

ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను కలిసిన ఉదయ్‌కుమార్


కంచర్ల శ్రీకాంత్‌తో ఉదయ్‌కుమార్

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడిగా నియమితుడైన ఉదయ్‌కుమార్ పార్టీ నేతలతో కలిసి ఆదివారం కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్‌ను ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఘనంగా సన్మానించారు. పార్టీలోని నేతలు, కార్యకర్తలతో మమేకమై సమష్టి కృషితో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఎమ్మెల్సీ సూచించారు. కార్యక్రమంలో నేతలు విజయరామిరెడ్డి, ఆర్ఎస్ మణి, చంద్ర, రాజేంద్ర, సింగిరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్.ఆర్.పాలసీ అమలు చేయండి


చంద్రబాబుతో బాలసుబ్రహ్మణ్యం

పలమనేరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్.ఆర్.పాలసీ అమలు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేసి, వినతి పత్రం అందజేసినట్లు రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి పి.బి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఇటీవల తిరుమల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రిని పి.బి. బాలసుబ్రహ్మణ్యం కలిసి వినతి పత్రం అందజేస్తూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్టు తెలిపారు. రాష్ట్రంలో అధిక జీతం తీసుకొంటున్న కాంట్రాక్టు ఎంప్లాయిస్‌కు తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నారని, కనీస వేతనానికి నోచుకోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం తల్లికి వందనం పథకం నిలిపి వేసినట్లు బాలసుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రికి విన్నవించినట్లుతెలిపారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళాలు

సోమల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో కొలువుదీరిన స్వయంభేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న శివపార్వతుల కల్యాణ మండపానికి పలువురు విరాళం అందజేసినట్లు ధర్మకర్త బీవీ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం సోమల బస్టాండ్‌కు చెందిన వన్నేటి వెంకటరమణ, విజయమ్మ దంపతులు రూ.11,111, రామిశెట్టి వెంకటరమణ, రత్నమ్మ దంపతులు రూ, 10,116, పచ్చిపులుసు సురేశ్ శెట్టి 10 ఫ్యాన్లు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ అధికారి సీజీ రెడ్డెప్ప, విశ్రాంత ఎల్ఐ వీవీ రమణ, లింగయ్య పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో విజేత దీక్షిత



సదుం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాల్లో భాగంగా తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన నృత్యప్రదర్శనలో సదుం మండలం నడిగడ్డ గ్రామం కురవపల్లెకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, రేవతిల కుమార్తె దీక్షిత భరత నాట్యంలో ప్రతిభ కనబరిచి ప్రథమ విజేతగా నిలిచింది. రెడ్డి దీక్షిత పీలేరులోని నారాయణ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సహవిద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం రెడ్డి దీక్షితను అభినందించారు.

ఆయుర్వేదంతోనే సంపూర్ణ ఆరోగ్యం


రోగులకు వైద్య సేవలు అందిస్తున్న ఆయుర్వేద వైద్యులు

వి.కోట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదంతోనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కాగలరని డాక్టర్ శివసాహితి అన్నారు. ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని వి.కోట టీటీడీ కల్యాణ మండపంలో సుప్రభాత్ సుఖాయు ఆయుర్వేద ఆస్పత్రి వారిచే ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు 200 మంది రోగులు హాజరయ్యారు. బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

దుస్థితిలో లక్ష్మీనారాయణస్వామి ఆలయం


దుస్థితిలో ఉన్న లక్ష్మీనారాయణస్వామి ఆలయం

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం గ్రామంలో వెలసివున్న పురాతనమైన లక్ష్మీనారాయణస్వామి ఆలయం ఆలనాపాలనా కరువై దుస్థితికి చేరుకుంది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో వ్యాసరాయలచే నిర్మించినట్లు చెబుతున్న ఈ ఆలయం గతంలో నిత్యపూజలతో కళకళలాడుతుండేది. కాలక్రమేణా దీనిగురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో కళాకాంతులు కోల్పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధూపదీప నైవేద్యాలు కరువై ప్రస్తుతం ఆలయ ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలు, గుబురుపొదలతో నిండి అధ్వానంగా తయారైంది. ఆలయగోడలు కూడా బాగా దెబ్బతిని పగుళ్లుబారాయి. ఒకప్పుడు కడపనత్తం గ్రామంలో 101 బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవి. దీంతో వ్యాసరాయలు ఈ ప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు బ్రాహ్మణుల కోరికమేరకు ఇక్కడ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు పెద్దలు చెబుతున్నారు. ఆలయ మొదటి అర్చకుడిగా వడయార్‌స్వామి ఉండేవారని, ఆయన ఇక్కడే జీవసమాధి అయినట్లు తెలిపారు. ఆయన స్మృతికి చిహ్నంగా ఆలయంవద్ద బృందావనం కూడా నిర్మించారు. నారాయణస్వామి ఒడిలో లక్ష్మీదేవి కూర్చున్నట్లు ప్రతిష్ఠింపబడి ఉన్న మూలవిరాట్ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. పక్కనే నాగదేవత విగ్రహం కూడా కళాకాంతులతో ఉంది. ఎంతో ప్రసిద్ధిచెందిన ఈ ఆలయానికి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం చేయూతనందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మంత్రి సవితను కలిసిన శాంతిపురం టీడీపీ నేతలు


మంత్రి సవితను సన్మానిస్తున్న శాంతిపురం నేతలు

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఆదివారం జరిగిన కురబకుల ఆత్మీయ సమావేశంలో శాంతిపురం మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మంత్రి సవితను సన్మానించారు. కార్యక్రమంలో నేతలు బీరేష్‌గౌడ, ప్రసాద్, నారాయణ, కదిరప్ప, బాలకృష్ణ పాల్గొన్నారు.

పుంగనూరు ఫొటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం



పుంగనూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఫొటోగ్రాఫర్ల సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షులు చంద్రలక్ష్మీపతి తెలిపారు. ఆదివారం స్థానిక ఏఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఫొటోగ్రాఫర్ల సమావేశంలో నూతన అధ్యక్షుడిగా నాగభూషణం, ఉపాధ్యక్షుడిగా బండిబాలు, కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా బోస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగభూషణం మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి భక్తులకు భోజన ప్యాకెట్ల పంపిణీ

సోమల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు ప్రాంతాల నుంచి కాలినడకన తిరుమలకు వెళుతున్న భక్తులకు ఆదివారం తిరుపతి - పుంగనూరు మార్గంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో పలువురు దాతలు ఉచిత భోజన ప్యాకెట్లను, తాగునీటి బాటిళ్లు అందజేశారు. శ్రీకృష్ణదేవరాయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శేష , సింహ వాహనాలపై నారాయణుడి విహారం


శేష వాహనంపై విహరిస్తున్న స్వామి వారు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేష, సింహ వాహనాలపై స్వామివార్లు ఆదివారం విహరించారు. రాత్రి సింహవాహనంపై ఊరేగారు. శేషవాహన సేవకు హైదరాబాద్‌కి చెందిన ఇందిర, రామప్రసాద్, బెంగుళూరుకు చెందిన రాగిణి, సుందరరాజన్ కుటుంబీకులు, సింహవాహనసేవకు విజయలక్ష్మి, కృష్ణమాచారి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. తిరుపతి లక్ష్మీనారాయణ భవన్ హోటల్ యాజమాని శ్రీనివాసులు రెడ్డి సహకారంతో భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతార్ కుటుంబేష్ శ్రీనివాసకల్యాణం హరికథాకాలక్షేపం చేయగా, జనార్ధన్ అన్నమయ్య కీర్తనలు ఆలపించారు.

43 కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్లు


పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

రామకుప్పం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పశువైద్య కేంద్రంలో ఆదివారం వైద్యాధికారి జయశ్రీ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సిన్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 43 కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. పెంపుడు కుక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారి యజమానులకు వివరించారు.

శ్రీవారి గొడుగు, పాదుకలకు ఎమ్మెల్యే పూజలు



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్ర జ్యోతి): తిరుమల శ్రీవారికి సమర్పించే వాహన సేవ గొడుగు, పాదుకలకు ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది హిందూ మహాసభ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొడుగు, పాదుకలు శ్రీపురం శ్రీనారాయణ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించాక తమిళనాడులోని పలు గ్రామాల మీదుగా పూజలు అందుకుంటూ తిరుమల చేరుకుంటాయి. యాత్రలో భాగంగా వీటిని ఎమ్మెల్యే నివాసానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన కల్పించండి


దుకాణదారులకు కరపత్రాలు అందిస్తున్న జితేంద్రబాబు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీఎస్టీపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని దుకాణదారులకు జీఎస్టీ జిల్లా అధికారి జితేంద్రబాబు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పలు దుకాణాల యజమానులతో మాట్లాడారు. దుకాణదారులు తప్పనిసరిగా జీఎస్టీ తగ్గిన వస్తువుల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. అసిస్టెంటు సేల్స్‌ట్యాక్స్ ఆఫీసర్ వివేక్ పాల్గొన్నారు.

మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని దుర్గాంబ ఆదివారం మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయికృపా అపార్ట్‌మెంట్‌లోని బాబా ఆలయంలో కాత్యాయనీదేవి అలంకారం, గిరింపేట శివగామి సుందరి అమ్మ సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి గాజుల అలంకారం, తేనెబండలోని ముత్యాలమ్మ.. సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.



రెస్కో ప్రధాన కార్యాలయం

రెస్కో అవినీతి విచారణ నిగ్గు తేలేనా?

- 'వైసీపీ' నియామక ఉద్యోగుల్లో ఆందోళన
- తొలగిస్తే ఏర్పడబోయే పరిణామాలపై అధికార పార్టీలోనూ కలవరం
- నేడు మహాజన సభ

కుప్పం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం రెస్కోలో గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై చర్చ ఇంకా కొనసాగుతూనే ఉంది. తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం దాటుతున్నా, విచారణ నివేదిక అందుబాటులో ఉన్నా, ఎందుకనో నిర్ణయం తీసుకోవడానికి ఇటు పాలకులు, అటు ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తూ ఉన్నారు. సుమారు 130 మంది ఉద్యోగుల భవితవ్యాన్ని నిర్దేశించే ప్రభావం ఉండడంవల్లే ఈ జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా నియమితమైన పాలకమండలి ఆధ్వర్యంలో రెస్కో మహాజన సభ సోమవారం జరుగనుంది. రెస్కో అవినీతి, దానిపై నడిచిన విచారణ నివేదిక అమలు, వంటి అంశాలపై తాజాగా మరోమారు చర్చలోకి వచ్చాయి.

కుప్పం రెస్కో బైలా సవరణతో పాటు, వైసీపీ హయాంలో ఈ సంస్థలో జరిగిన అవినీతిపై సాగిన విచారణ నివేదికను మహాజన సభలో సమర్పించనున్నట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో సుమారు 130 మంది ఉద్యోగులను అవసరానికి మించి, అక్రమంగా నియమించుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. దీంతోపాటు అక్రమ పదోన్నతులపై కూడా ముఖ్యమైన మరో ఆరోపణ వుంది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలుత జేసీ స్థాయిలో ఈ ఆరోపణలపై విచారణ జరిగింది. అప్పట్లో ఉద్యోగులకు అర్హత పరీక్షలు సైతం నిర్వహించారు. అయితే ఇది సక్రమంగా జరగలేదని, కో ఆపరేటివ్ ఉన్నతాధికారుల్లో ఒకరిద్దరు స్వయంగా అక్రమ నియామకాలలో అస్మదీయులను నియమించుకున్నారన్న ఆరోపణలు కొత్తగా వెలుగు చూడడంతో ఈ విచారణపై నీలినీడలు కమ్ముకుని విశ్వసనీయత లోపించింది. దీని కారణంగా వైసీపీ హయాంలో రెస్కోలో జరిగిన అక్రమాలపై, కో ఆపరేటివ్ సొసైటీల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని కూటమి ప్రభుత్వం విచారణాధికారిగా నియమించింది. ఆమె విచారణ సుమారు నాలుగైదు నెలలపాటు సాగింది. విచారణ నివేదికను కూడా ప్రభుత్వానికి సమర్పించారు. అయితే ఈ నివేదికను ఇప్పటిదాకా ఎవరూ బయట పెట్టలేదు. నివేదికను గోప్యంగా ఉంచడంపట్ల అనంతర కాలంలో ఆరోపణలు వినిపించాయి. అప్పటి విచారణ నివేదికను సోమవారం జరుగనున్న రెస్కో మహాజన సభలో సమర్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

అధికార పార్టీలో ఆందోళన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఏడాదిన్నర పైగా అయింది. విచారణ నివేదికను ప్రభుత్వానికి సమర్పించి కూడా సుమారుగా ఎనిమిది, తొమ్మిది నెలలు అవుతోంది. వైసీపీ హయాంలో సుమారుగా 100 మందికి పైగా నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు ఇచ్చారని, అక్రమ పదోన్నతులు జరగడం నిజమని, ఇంకా కొందరు ఉద్యోగులు కొన్ని రకాల అవినీతికి పాల్పడ్డారని, వైసీపీ హయాంలో టెండర్లు ఆహ్వానించకుండా నామినేషన్ల మీద పనులు కట్టబెట్టారని విచారణ నివేదిక తేల్చినట్లు ప్రచారం ఎప్పటినుంచో జరుగుతోంది. అయినా ఇంతవరకూ నివేదికను అధికారికంగా బయట పెట్టలేదు. అంతేకాదు, ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదు. విచారణ ఒకటి జరిగిందని, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు, అధికారులను అది తప్పు పట్టిందన్న విషయాన్ని దాదాపు అందరూ మరచిపోయారు. ఇటువంటి తరుణంలో మహాజన సభ జరుగుతుండడం, అందులో అదనపు రిజిస్ట్రార్ ఇచ్చిన నివేదికను సమర్పిస్తామని అధికారులు ప్రకటించడం కుప్పంలో చర్చనీయాంశంగా మారింది. అటు రెస్కో ఉద్యోగులతోపాటు అధికార టీడీపీలో కూడా ఈ విషయంలో ఆందోళన నెలకొంది. కారణం, అక్రమ నియామకాలుగా ముద్రపడ్డ 100 మందికి పైగా ఉద్యోగులను విధులనుంచి తొలగిస్తారన్న ప్రచారం జోరందుకోవడం. ఉద్యోగులు వందమందే కావచ్చు కానీ, వారిమీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు మరో వందా, వందా యాభై దాకా ఉంటాయి. ఒకవేళ ఉద్యోగులను తొలగించడం అంటూ జరిగితే రాజకీయంగా తమకు తీవ్ర నష్టం జరుగుతుందని అధికార పార్టీ శ్రేణులు భయపడుతున్నాయి. అదీకాక వీజీ.ప్రతాప్ చైర్మన్‌గా రెస్కో పాలక మండలిని నియమించి నెలరోజులైనా కాలేదు. అధికారులే పర్సన్ ఇన్‌చార్జిలుగా ఉన్నప్పుడే విచారణ నివేదికను బయటపెట్టి, ఉద్యోగులను తొలగించడమో లేదా ఇతరత్రా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడమో జరిగి ఉంటే కొంతలో కొంత అధికార పార్టీకి సంబంధం లేకుండా ఉండేది. సరిగ్గా పాలక మండలి నియామకమై మొదటి మహాజన సభలోనే అది అవినీతి ఆరోపణలపైన అయినా సరే, ఉద్యోగుల తొలగింపు జరిగితే త్వరలోనే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వ్యతిరేక ప్రభావం పడుతుందన్న ఆందోళన టీడీపీలో అంతర్గతంగా నెలకొంది. 2014-2019మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పటినుంచీ ఉద్యోగాల్లో ఉంటూ పదోన్నతులు సైతం పొందిన 17మంది రెస్కో ఉద్యోగులను సైతం తొలగించబోతున్నారన్న ప్రచారం మరింత నష్టం కలిగించే అవకాశం ఉన్నదన్న భావన టీడీపీ నేతల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో రెస్కో మహాజన సభలో ఏమి జరుగనుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావుకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని ఆదివారం పలువురు హైకోర్టు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. స్వామివారిని ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌మహార, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వైలక్ష్మణరావులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. విడివిడిగా దర్శించుకున్న వీరిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, ఎస్‌ఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం



చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం చిత్తూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించి, ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా సిద్దు, కార్యదర్శిగా మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి రుతిక్, కోశాధికారిగా దేవానంద్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, కుసుమలను సభ్యులు ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.వారిని పలువురు సన్మానించారు.

గుర్రం జాషువాను ఆదర్శంగా తీసుకోవాలి


కవులను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాకవి గుర్రం జాషువాను నేటితరం సాహితీవేత్తలు ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు సూచించారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ శ్రేణులు సేవా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా చిత్తూరు ఉత్తర మండల బీజేపీ అధ్యక్షుడు లతీష్ చిన్ని ఆధ్వర్యంలో ఆదివారం సలు సేవా కార్యక్రమాలు జరిగాయి. దొడ్డిపల్లె సప్తకన్నికల అమ్మవార్ల ఆలయం నుంచి మురకంబట్టులోని వినాయక స్వామి ఆలయం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యానికి సేవలందిస్తున్న పలువురు కవులను సన్మానించారు. స్థానిక ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఎన్‌పీ వెంకటేశ్వర చౌదరి, నేతలు చిట్టిబాబు, బాబు, చిన్ని, రవికుమార్, మోహన్ నాయుడు, షణ్ముగం, సురేష్, గోకుల్ యాదవ్, శ్రీనివాసరావు, సప్తకన్నికల అమ్మవార్ల ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పీఎస్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో



పుంగనూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పుంగనూరు శివార్లలోని గూడూరుపల్లె జగనన్నకాలనీ టిడ్కో ఇళ్లకు తాగునీటి సమస్య తీర్చాలంటూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఆదివారం గూడూరుపల్లె వద్ద చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై నిరసన చేపట్టడంతో ఈమార్గంలో రాకపోకలకు స్తంభించాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని, మోటారు చెడిపోయిందని రిపేరు చేయిస్తామని చెప్పడం తప్ప సమస్య తీర్చలేదన్నారు. టిడ్కో ఇళ్ల అపార్ట్‌మెంట్ నుంచి ఎక్కిదిగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని వాపోయారు. నీటి ట్యాంకర్లు పంపిస్తామని చెప్పడం తప్ప తమ గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్లలో వీధి దీపాలు వెలగడం లేదని, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, పారిశుధ్యం లోపించి జ్వరాల బారిన పడుతున్నామని వాపోయారు. రోడ్డుకిరువైపులా వాహనాలు బారులు తీరిన విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన విరమించాలని, అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. నీటిసమస్య తీర్చాలని సీఐ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళనకారులకు నచ్చచెప్పి రోడ్డుపై నుంచి పక్కకు తీసుకెళ్లి వాహనాల రాకపోకలను పునరుద్ధరించి ఆందోళన విరమింపజేశారు.

టౌన్ బ్యాంకు షేర్ హోల్డర్లకు ఆరు శాతం డివిడెండ్



మహాజన సభలో ప్రసంగిస్తున్న రమేష్ నాయుడు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'కొందరి తప్పిదాల వల్ల.. మూతబడి నష్టాలబాట పట్టిన చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఇప్పుడిప్పుడే కోలుకుంటూ ఈ ఏడాది రూ.1.46 కోట్ల లాభాల దిశలో చేరింది. మీ అందరి సహకారంతో బ్యాంకును మరింత అభివృద్ధి బాటలో నడిపిస్తా' అని చైర్మన్ రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం 118వ బ్యాంకు మహాజన సభ స్థానిక గిరింపేట బ్రాంచ్‌లో జరిగింది. ఈ సందర్భంగా 'ఏ' క్లాస్ మెంబర్లు, షేర్ హోల్డర్లను ఉద్దేశించి చైర్మన్ ప్రసంగించారు. వచ్చిన లాభాలను దృష్టిలో ఉంచుకుని సభ్యులకు ఆరుశాతం డివిడెండ్ ఇస్తున్నట్లు ప్రకటించారు. గత పాలకవర్గాల తప్పిదాలపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని, రికవరీపై తమ పాలకవర్గం దృష్టిపెడుతోందని చెప్పారు. బ్యాంకుకు దీర్ఘకాలికంగా ఉన్న బకాయిల వసూళ్లపై తాము నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. షేర్ కేపిటల్ మొత్తాన్ని పెంచడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, సహకారశాఖ అధికారుల సూచనలతో బ్యాంకును అభివృద్ధిబాటలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. బంగారం, ఇళ్ల కుదువ వ్యాపారాలు మరింత పెంచాలని నిర్ణయించినట్లు వివరించారు. కష్టకాలంలో బ్యాంకు రివైవల్ కోసం సహకరించిన షేర్ హోల్డర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాన బ్యాంకుతోపాటు దర్గా, గిరింపేట బ్రాంచ్‌ల్లో మైనర్ రిపేర్లు చేపడతామన్నారు. తొలుత ఇన్‌చార్జి సీఈవో సుమతి అజెండాను ప్రవేశపెడుతూ.. బ్యాంకు పరిపాలనా నివేదిక, లాభనష్టాల పట్టికతో కూడిన నాలుగు అంశాలను సభ్యులకు వివరించారు. డైరెక్టర్లు టి.సురేష్‌బాబు, ఎ.అన్సర్, జి.నరసింహులు, మాజీ వైస్ చైర్మన్ రఘునందన, జనసేన నాయకురాలు ఆరణి కవిత, న్యాయవాది దేవరాజులు నాయుడు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు తదితరులు బ్యాంకు అభివృద్ధికి పలు సూచనలిచ్చారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని దేవళంపేట పంచాయతీలో శనివారం రాత్రి వరి, మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన 9 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు రవి మామిడితోటలోకి ప్రవేశించి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి నాయనిచెరువు వద్దకు వెళుతూ మార్గంలోని పెద్దబండవద్ద కలబందలను తినేశాయి. నాయనిచెరువు కట్టకిందకు చేరుకున్న ఏనుగులు రైతులు సుధాకర్, ప్రభాకర్‌కు చెందిన వరిపంటను తినేసి ఇష్టానుసారంగా తొక్కేశాయి. చిన్ననగరి కృష్ణమూర్తికి చెందిన పశుగ్రాసంను తినేసిన అనంతరం దిగుమూరివారిపల్లి వద్దకు చేరుకొని గురుస్వామి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగులు మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకున్నాయి. ఆదివారం పగలంతా ఏనుగుల గుంపు అడవిలోని చాకలోనికోన వద్ద తిష్ట వేశాయి. అటవీ సరిహద్దులో ఉన్న దేవళంపేట, పాళెం, కమ్మపల్లి పంచాయతీ ప్రజలు ఏనుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో పొలాల వద్ద బసచేయరాదని మంగళంపేట ఎఫ్‌బీవో మధు హెచ్చరించారు.

ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనంతో ఆత్మహత్య


దుర్గాప్రసాద్ మృతదేహం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనం, మద్యానికి బానిసైన తండ్రి కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు గంగనపల్లెలో మేరీ లావణ్య, సెల్వం దంపతులు తమ కుమారుడు దుర్గాప్రసాద్‌తో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరికి వైఎస్సార్ నగర్‌తోపాటు గంగనపల్లె, గిరింపేటలో సొంత ఇళ్లు ఉన్నాయి. ఇటీవల సెల్వం మద్యానికి బానిసవడంతో దుర్గాప్రసాద్ తరచూ ఇంట్లో గొడవపడుతుండేవాడు. మరోవైపు దుర్గాప్రసాద్ ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడ్డాడు. తరచూ మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ మానసిక ఒత్తిడికి గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంలో గిరింపేటలో ఉన్న ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దచెరువుకు మళ్లీ గండి

- ఆక్రమణదారుల దుశ్చర్య
- ఆయకట్టుదారుల ఆందోళన


నిండిన పెద్దచెరువు - గండినుంచి వృధాగా పోతున్న నీరు



పలమనేరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పెద్దచెరువు కట్టకు ఆక్రమణదారులు మరోసారి గండికొట్టారు. నెల రోజుల క్రితం చెరువు కట్టకు గండి కొట్టడంపై ప్రముఖంగా పత్రికల్లో రావడం... అధికారులు స్పందించి ఆ గండిని పూడ్చివేయడం తెలిసిందే.ఈ రెండు దశాబ్దాల కాలంలో పలమనేరు పంచాయితీ స్థాయినుంచి మున్సిపాలిటీ స్థాయికి అక్కడినుంచి రెవెన్యూ డివిజన్ స్థాయికి ఎదగడంతో ఇక్కడ నివేశ స్థలాలకు గిరాకీ ఏర్పడింది.కొందరు ఆక్రమణదారులు పెద్దచెరువును కబ్జా చేసి భవన నిర్మాణాలు సాగించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ చెరువులో కలుస్తున్న మురుగునీటిని మళ్లించే నెపంతో చెరువు కట్టకు పడమరవైపు గండికొట్టి నీటిని బయటకు పంపించారు. అప్పట్లో ఈ విషయంపై పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ఈ చెరువు కట్టకు కొట్టిన గండిని అధికారులు పూడ్చివేశారు. దీంతో చెరువు వర్షపు నీటితో నిండుతూ వచ్చింది.నెల రోజుల క్రితం 90 శాతం నిండి ఇక కలుజు పారడమే తరువాయి అనుకుంటుండగా పెద్దచెరువు పడమర వైపు కట్టకు కొందరు ఆక్రమణదారులు గండి కొట్టారు. దీంతో చెరువులో నీరు కేవలం మూడు రోజుల వ్యవధిలో 30 శాతం వృధాగా బయటకు వెళ్లిపోయింది. ప్రజా ప్రతినిధులతో పాటు పలమనేరు పరిరక్షణ సమితి , లయన్స్‌క్లబ్, రిక్రియేషన్ క్లబ్ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అధికారులు గండిని పూడ్చివేశారు.నెలరోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ చెరువు 95 శాతం మేర నిండింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొందరు రెండు రోజుల క్రితం చెరువు పడమర వైపు ఉన్న కలుజు వద్ద గండి కొట్టారు. దీంతో చెరువులోని నీరు వృధాగా కలుజు కాలువ గుండా వెలుపలికి వెళ్లిపోతోంది. అధికారులు స్పందించి గండిని పూడ్చివేసి చెరువులో నీటిని నిలువరించి భూగర్భజాలాల పెంపునకు కృషి చేయాలని పట్టణ ప్రజలు, ఆయకట్టుకు సాగునీటి సమస్య లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

విద్యారంగం బలోపేతానికి ప్రత్యేక కృషి: గౌనివారి

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా రూ.400కోట్ల ఫీజురీఎంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రూ.4000 కోట్ల బకాయిలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రూ.1200 కోట్లు విడుదల చేసిందన్నారు. ఇప్పటి వరకు మొత్తం రూ.1600 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు సీఎం ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం డీఎస్సీపై చేశారని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిర్వహించిన మెగా డీఎస్సీ మెగాహిట్‌గా నిలిచిందన్నారు. అన్ని అవాంతరాలను అధిగమించి విద్యామంత్రి లోకేశ్ 16,347 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తుందని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిర్వహించిన అన్ని డీఎస్సీలు టీడీపీ పాలనలోనే నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విద్యారంగంతో పాటు పారిశ్రామిక ప్రగతితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు.

చెల్దిగానిపల్లె జడ్పీ హైస్కూల్ స్వర్ణోత్సవం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రామకుప్పం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సాధారణంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం అంటే కేవలం ఓ విద్యాసంవత్సరం కలిసి చదువుకున్న విద్యార్థులు మాత్రమే భాగస్వాములవుతారు. కానీ చెల్దిగానిపల్లె జడ్పీ ఉన్నతపాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు 5 దశాబ్దాలుగా అక్కడ చదువుకున్న వెయ్యికి మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరై సందడి, సందడిగా గడిపారు. విద్యావంతులుగా తమను తీర్చిదిద్దిన గురువులను ఘనంగా సన్మానించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలను తెలుసుకుని, పాఠశాల స్థాయిలో తాము చేసిన అల్లరిపనులు, ఉపాధ్యాయుల దండనలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. గుర్తుపట్టనంతగా మారిపోయిన తమ సహవిద్యార్థుల వద్దకు వెళ్లి పలకరించి తామెవరో గుర్తు చేస్తే సంభ్రమాశ్చర్యాలతో సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా అందరూ కలుసుకోవడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, రెస్కో మాజీ చైర్మన్ జయరామిరెడ్డి, తెలుగురైతు మండల అధ్యక్షుడు కొళ్ళపల్లెబాబు, రెస్కో డైరెక్టరు విజయ్‌కుమార్, సింగిల్‌విండో డైరెక్టరు సురేష్, సర్పంచు రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల హిందువులకు క్షమాపణ చెప్పాలి

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆర్‌ఎస్‌ఎస్ వాదిలా మారిపోయారంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితవాడల్లో 5 వేల ఆలయాలను నిర్మిస్తామని సీఎం ఇటీవల తిరుమలలో ప్రకటించడాన్ని ఉటంకిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. హిందూ వ్యతిరేకి, హిందూ ధర్మాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తున్న షర్మిల దీన్ని వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఆలయాల నిర్మాణ ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలన్న వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. ఆమె ఏ రోజన్నా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారా? ఎప్పుడైనా తిరుమల మెట్లెక్కారా అని నిలదీశారు. హిందూ ధర్మంపై నమ్మకం లేకపోతే జరూసలెం వెళ్లాలని సూచించారు. దేశం, ధర్మం కోసం పనిచేసే ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శించే స్థాయి ఆమెకు లేదన్నారు. షర్మిల తక్షణం హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గరుడ వాహనంపై శ్రీవారు



పెనుమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కలిగిరి కొండపై జరుగుతున్న వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తుల హర్షోల్లాసాల మధ్య గరుడవాహనంపై స్వామి వారు ఊరేగారు. శ్రావణ శోభతో ఆలయ ప్రాంగణం నిండిపోగా, భక్తులు స్వామి దర్శనానికి తరలి వచ్చారు. గరుడవాహనంపై స్వామి వారి అలంకార దర్శనం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, ప్రధాన అర్చకులు వాసుదేవాచార్య, ఉభయదారులు ఈశ్వర ప్రసాద్, హరిబాబు నాయుడు, యువరాజులు నాయుడు, యుగంధర్, కిషోర్, ఎస్‌ఎస్ నాయుడు, తులసినాయుడు, సురేష్‌చౌదరితో పాల్గొన్నారు.

కాణిపాకంలో గరుడ సేవ


గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన వరదరాజస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి తిరుమల గరుడ సేవకు అనుసంధానంగా గరుడ సేవను నిర్వహించారు. సాయంత్రం వరదరాజ స్వామికి అభిషేకం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత వరదరాజ స్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి మేళతాళాలు వాయిస్తూ కాణిపాక పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఉభయదారులుగా కాణిపాకానికి చెందిన యాదవ కులస్తులు వ్యవహరించారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు చిట్టిబాబు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ





మహిషాసురమర్దిని అలంకరణలోని గిరింపేట దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరింపేటలోని దుర్గాంబ ఆదివారం మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, పాలక మండలి ఛైర్మన్ దిలీప్ రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, మాజీ ఛైర్మన్ వీకే విశ్వనాథ్, వరుణ్ కుమార్, గుడిపాల బాలాజి, నళిని తిరుకుమరన్, ఇందు, కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, సాయి కృపా అపార్ట్‌మెంట్‌లోని బాబా ఆలయంలో కాత్యాయనీదేవి అలంకారం, గిరింపేట శివగామి సుందరి అమ్మ సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి గాజుల అలంకారం, తేనెబండలోని ముత్యాలమ్మ.. సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పొన్నియమ్మ గుడి వీధిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో సూర్యనారాయణ స్వామి అలంకారం, కోదండరామస్వామి ఆలయంలో వామన అవతారం ఏర్పాటు చేశారు.



కోదండరామస్వామి ఆలయంలో వామన అవతారం

శేష, సింహ వాహనాలపై నారాయణుడి విహారం



శేషవాహనంపై ఊరేగుతున్న నారాయణస్వామి

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేష, సింహ వాహనాలపై స్వామివార్లు ఆదివారం విహరించారు. రాత్రి సింహవాహనంపై ఊరేగారు. శేషవాహన సేవకు హైదరాబాద్‌కి చెందిన ఇందిర, రామప్రసాద్, బెంగుళూరుకు చెందిన రాగిణి, సుందరరాజన్ కుటుంబీకులు, సింహ వాహనసేవకు విజయలక్ష్మి, కృష్ణమాచారి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. తిరుపతి లక్ష్మీనారాయణ భవన్ హోటల్ యాజమాని శ్రీనివాసులురెడ్డి సహకారంతో భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతార్ కుటుంబేష్ శ్రీనివాసకల్యాణం హరికథాకాలక్షేపం చేయగా, జనార్ధన్ అన్నమయ్య కీర్తనలు, వెంకటేశ్వర భక్తీ గీతాలు ఆలపించారు. మాజీ ఆలయట్రస్టీ సతీమణి సుమిత్రాశ్రీధర్, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి పాల్గొన్నారు.

'జీఎస్టీ' తగ్గింపుతో సామాన్యులకు ఊరట: టీడీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ నాయకులు

పెనుమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రేట్లు తగ్గించడంతో సామాన్యులకు ఊరట ఇచ్చిందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు రుద్రయ్యనాయుడు అన్నారు. ఆదివారం టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. గృహనిర్మాణం, రవాణా, నీటి సరఫరా, విద్యుత్, ఆరోగ్య సదుపాయాలు, రహదారుల నిర్మాణం వంటి అనేక రంగాల్లో వ్యయభారం తగ్గిందని చెప్పారు. ఆర్థిక వ్యవస్థకు చురుకుదనం రావడంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమాన అబివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథనాయుడు, జిల్లా కార్యదర్శి తలారి రెడ్డెప్ప, పరమేశ్వరరెడ్డి, యాగమనాయుడు, శ్రీనివాసచౌదరి పాల్గొన్నారు.

దసరా క్రికెట్ పోటీలు ప్రారంభం



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభాకర్‌రాజు

నగరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేవీకే మైదానంలో దసరా క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రిటైర్డ్ డీవైఈవో, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ ప్రభాకర్‌రాజు పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కేవీకే ఇన్‌చార్జి బాబు మాట్లాడుతూ.. అండర్-11 విభాగంలో ఐదు టీమ్‌లు, అండర్-14 విభాగంలో నాలుగు టీమ్‌లు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి మోహన్, శీనురాజ్, కంచి క్రికెట్ ఆకాడమీ కోచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా మరగదాంబిక



కాణిపాకం: అన్నపూర్ణాదేవి అలంకరణలో మరగదాంబిక




విజయపురం: శాకాంబరి చండీగా కనకదుర్గమ్మ



శ్రీరంగరాజపురం: మహాలక్ష్మీ దేవిగా గంగమ్మ



గంగాధరనెల్లూరు: మహాలక్ష్మిగా అల్లియెల్లమ్మ



పాలసముద్రం: మహాచండీ దేవిగా చెవిటి గంగమ్మ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కాణిపాకంలోని మరగదాంబిక అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులను దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో భక్తులతో కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కాణిపాకం పుర వీధుల్లో ఊరేగించారు. ఏఈవో రవీంద్రబాబు, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయపురం: మిట్టూరులోని కనకదుర్గమ్మ.. శాకాంబరి చండీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ పూజారి మహేష్‌శర్మ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: అరిమాకులపల్లెలోని గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా వసంతమ్మ కుమారులు వ్యవహరించారు. వేణుగోపాలపురంలోని శ్రీమూర్తి అమ్మను గాయత్రీ దేవిగా అలంకరించారు. ఉభయదారులుగా పోలీ పాతిరెడ్డి, పోలీ మునెమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జలంధర్ నాయుడు, సిద్దయ్యశెట్టి, హిమాచలపతిరెడ్డి, చిరంజీవి, వెంకటరత్నం, జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: గ్రామంలోని అల్లియెల్లమ్మ.. మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. వేపంజేరి పంచాయతీ జంగాలపల్లెకు చెందిన కుమార్‌రెడ్డి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. తర్వాత ఎగువూరుకు చెందిన పంబల వాయిద్యాకారుడు మధు కుటుంబసభ్యులు అన్నదానం చేశారు.

పాలసముద్రం: బలిజకండ్రిగలోని చెవిటిగంగమ్మ.. మహాచండీదేవి అలంకరనలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగలో కొండమల్లీశ్వరస్వామి ఆలయ సముదాయంలోని రాజరాజేశ్వరి.. మహాచండీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ● కార్వేటినగరం మండలం దేరాకండ్రిగలోనూ నైనేరమ్మ.. మహాచండీదేవిగా అనుగ్రహించారు. ఉభయదారులుగా బి.వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతులు వ్యవహరించారు.

నింద్ర: మండలం కూనమరాజుపాళెంలోని మహాలక్ష్మి అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గీతామందిర ఆశ్రమ పీఠాధిపతి పుండరీక వరదానంద స్వామి, ప్రధానార్చకుడు రూపేష్‌కృష్ణ ఆచార్య, భక్తులు పాల్గొన్నారు.

నగరి: పట్టణంలోని దేశమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కరకంఠేశ్వర ఆలయంలో కామాక్షి అమ్మవారికి మహాకాళి అలంకరణ చేశారు. బుగ్గ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవికి కాళరాత్రి అలంకారం చేశారు.

బంగారుపాళ్యం: గ్రామదేవత ముత్యాలమ్మ.. సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బంగారుపాళ్యం మం డల కరణం సంక్షేమ సంఘంవారు వ్యవహరించారు.





వెదురుకుప్పం: దేరాకండ్రిగలో మహాచండీదేవిగా నైనేరమ్మ, డీఆర్ఎన్‌కండ్రిగలో మహాచండీదేవిగా రాజరాజేశ్వరిదేవి



నింద్ర: మహాచండీ దేవిగా మహాలక్ష్మి అమ్మవారు





నగరి: కాళరాత్రి దేవిగా అన్నపూర్ణేశ్వరీదేవి, మహాకాళిగా కామాక్షిదేవి



బంగారుపాళ్యం: సరస్వతీదేవిగా ముత్యాలమ్మ

శ్రీవారి గొడుగు, పాదుకలకు ఎమ్మెల్యే పూజలు



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి సమర్పించే వాహనసేవ గొడుగు, పాదుకలకు ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది హిందూ మహాసభ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొడుగు, పాదుకలు శ్రీపురం శ్రీనారాయణ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించాక తమిళనాడులోని పలు గ్రామాల మీదుగా పూజలు అందుకుంటూ తిరుమల చేరుకుంటాయి. యాత్రలో భాగంగా వీటిని ఎమ్మెల్యే నివాసానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ భవనాలను ఇలాగే వదిలేస్తారా?



కటికపల్లెలో నిరుపయోగంగా ఉన్న సచివాలయం, ఆర్‌బీకే భవనాలు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓవైపు లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. మరోవైపు అరకొర వసతుల నడుమ ఉన్న భవనాల్లో ఉద్యోగులు, జనం ఇబ్బంది పడాల్సి వస్తోంది. కటికపల్లెలో ఈ పరిస్థితి నెలకొంది. ఇక్కడ వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.40లక్షలు వెచ్చించి సచివాలయం, రూ.21లక్షలతో రైతు సేవా కేంద్రం (ఆర్‌బీకే), రూ.24లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. ఈ మూడు భవనాల్లో చిన్న చిన్న పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పూర్తిచేసి, వినియోగం తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరుస్తున్న భవనంలోనే సచివాలయం



పెచ్చులూడిన స్లాబు

పెనుమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాతంబాకం పంచాయతీ భవనంలో సచివాలయం నిర్వహిస్తున్నారు. ఈ భవనం పాతది కావడంతో స్లాబు పెచ్చులూడి, ఇనుప కమ్మీలు కనిపిస్తున్నాయి. పైగా వర్షాలు కురిసినప్పుడల్లా ఉరుస్తుండటంతో సిబ్బంది ఇబ్బంద పడుతున్నారు. మరోవైపు పక్కనే నూతన సచివాలయ భవనం పూర్తయ్యిందని, దానికి ప్రారంభోత్సవం చేసి సమస్యను పరిష్కరించాలని సిబ్బందితోపాటు స్థానికులు కోరుతున్నారు.

థామస్‌కు బెంగళూరులో టీడీపీ నేతల స్వాగతం



గంగాధరనెల్లూరు/పాలసముద్రం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం.థామస్ ఆధ్వర్యంలో చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ సహకారంతో ఆదివారం కుప్పంలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్యాంప్‌లో పాల్గొనడానికి విజయవాడ నుంచి థామస్ బెంగళూరుకు విమానంలో వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు టీడీపీ నేతలు స్వాగతం పలికారు. వీరిలో.. పార్లమెంట్ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు మహేష్‌నాయుడు, తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి దేవపల్లి ధనంజయనాయుడు, టీడీపీ నేతలు తాళ్లూరి శివనాయుడు, రావిళ్ల చిట్టిబాబు, రూపేష్ కుమార్, ప్రభాకర్‌నాయుడు, రుషేంద్రబాబు, గోళ్ల ప్రసన్నకుమార్, యశ్వంత్, విక్రమ్, బాలాజి యాదవ్ ఉన్నారు.

జీఎస్టీపై అవగాహన కల్పించండి



దుకాణదారులకు కరపత్రాలు అందిస్తున్న జితేంద్రబాబు

బంగారుపాళ్యం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జీఎస్టీపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని దుకాణదారులకు జీఎస్టీ జిల్లా అధికారి జితేంద్రబాబు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పలు దుకాణాల యజమానులతో మాట్లాడారు. దుకాణదారులు తప్పనిసరిగా జీఎస్టీ తగ్గిన వస్తువుల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. అసిస్టెంటు సేల్స్‌ట్యాక్స్ ఆఫీసర్ వివేక్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఐరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బొమ్మసముద్రం ఎస్సీ కాలనీలో ఓ విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. పంచాయతీ సర్పంచ్ రఘునాథయ్య ఇంటి ముందే ఈ స్తంభం ఉండటం గమనార్హం. రెండు నెలలుగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని సర్పంచ్ తెలిపారు. మోడల్ పంచాయతీలోనే పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. త్వరగా ఈ స్తంభాన్ని మార్చకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు.

సంక్షిప్తంగా..

నగరపాలక కార్యాలయంలో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని తెలిపారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు వస్త్రదానం



నగరి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరిలోని ఓం సీతాలయంలో ఆదివారం దాతల సహకారంతో 154 మంది పేదలకు వస్త్రదానంతోపాటు పనిముట్లు వితరణ చేసినట్లు ఆలయ నిర్వాహకుడు జ్యోతినాయుడు తెలిపారు. సరోజమ్మ, మనోహర్, హరిబాబు, రవిబాబు, బాబు, రమేష్ బాబు, చెన్నై సాఫ్ట్‌వేర్ రవిచంద్రన్, నెల్లూరు ఫిష్ డెయిరీ గుణశేఖర్, కుమార్, కన్నప్ప నాయుడు, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా సూచించిన మార్గంలో నడవాలి



పూజల్లో పాల్గొన్న సీకే బాబు తదితరులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబా సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ప్రముఖ టీవీ సూపర్ సింగర్ సుమతి చెప్పారు. ఆదివారం టీటీడీ కల్యాణ మండలంలో సాయిబాబా జయంతి వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పూజలు చేశారు. గుండ్లపూడి శ్రీనివాసన్, దాయం విజయకుమార్ ఆధ్వర్యంలో శ్రీసాయి గానామృతం, సంకీర్తనలు అలరించాయి. గుణశేఖర్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శునకాల నుంచి సంక్రమించే రేబిస్ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జేడీ ఉమామహేశ్వరి సూచించారు. రేబిస్ వ్యాక్సిన్‌ను కనుగొన్న లూయిస్ పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం చిత్తూరులోని పశువ్యాధి నిర్ధారణశాలలో శునకాలకు ఉచిత వ్యాక్సిన్లు వేశారు. జేడీ మాట్లాడుతూ.. పెంపుడు కుక్కలకు ఏడాదికోసారి రేబిస్ వ్యాక్సిన్ వేయించాలనిచెప్పారు. అన్ని పశువైద్యశాలల్లో శునకాలకు ఉచిత వ్యాక్సిన్లు వేస్తున్నట్లు తెలిపారు.

అధ్వానంగా కొంగారెడ్డిపల్లె శ్మశాన వాటిక

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొంగారెడ్డిపల్లె శ్మశాన వాటిక అధ్వానంగా తయారైంది. మెయిన్ రోడ్డు నుంచి శ్మశానవాటికకు వెళ్లే దారైతే మరీ దారుణంగా తయారైంది. చికెన్ సెంటర్లు, భవనాల వ్యర్థాలతో పాటు దారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల పొదలతో నిండిపోయాయి. భౌతిక కాయాన్ని తీసుకెళ్లి.. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ శ్మశాన వాటికను పరిశీలించి, శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. మరోవైపు ఈ శ్మశాన వాటిక స్థలాన్ని కూడా కొందరు ఆక్రమించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపైనా దృష్టి పెట్టి, శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.







వ్యర్థాలు, ముళ్ల పొదలతో నిండిన శ్మశాన వాటిక